

బాలుడా.. గోపాలుడా

పాఠశాలల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

అంబర్‌పేట/ముషీరాబాద్ నియోజకవర్గాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి పండగ ముందుగానే వచ్చింది. ఇక్కడ పాఠశాలల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో ఆకట్టుకున్నారు. అల్లరి కృష్ణుల చిలిపి చేష్టలు, పిల్లన గ్రోవి చేపట్టుకుని సయ్యాటలు, వెన్న దొంగతనాలు, గోవర్ధనగిరిని చిటికిన వేలితో పైకెత్తే దృశ్యాలు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. చిన్నతనం నుంచే మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తూ ఆధ్యాత్మిక మార్గం వైపు అడుగులు వేయించడం ఎంతో గొప్ప విషయమని నారాయణగూడలోని నారాయణ పాఠశాల కో–ఆర్డినేటర్ నూర్జహాన్ అన్నారు.

– అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ బృందం









దేశవ్యాప్తంగా ఆడబిడ్డలకు భద్రత కల్పించాలి

అస్సాం బాలికలపై సామూహిక అత్యాచార దుండగులను శిక్షించాలని నిరసన



ముషీరాబాద్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా నగర కార్యదర్శి నాగలక్ష్మి

ముషీరాబాద్: అస్సాంలో స్కూల్‌కు వెళ్లి వస్తున్న బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఐద్వా నగర కార్యదర్శి కె.నాగలక్ష్మి డిమాండ్ చేశారు. అస్సాంలో బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరస్తాలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఆడబిడ్డలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అస్సాంలో 13 సంవత్సరాల బాలికపై సామూహిక అత్యాచారం చేయడం దారుణం అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. మహిళలకు తగిన భద్రత కల్పించాలని కోరారు. ధర్నాలో ఐద్వా నగర అధ్యక్షురాలు పద్మ, నాయకులు వరలక్ష్మి, పుష్ప, లక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

‘బతుకమ్మ కుంట పక్కా ప్రైవేట్ పట్టా ల్యాండ్’

అంబర్‌పేట: అంబర్‌పేట మండల పరిధిలో గల బతుకమ్మ కుంట స్థలం పక్కా ప్రైవేట్ స్థలమని.. అందులో ఎలాంటి కుంట లేదని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత ఎడ్ల సుధాకర్ రెడ్డి అన్నారు. బతుకమ్మ కుంట స్థలం దగ్గరకు వచ్చి అక్కడ కుంటను పునరుద్ధరించాలని మాట్లాడటం హాస్యాస్పదమని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆయన బతుకమ్మ కుంట స్థలం విషయమై మీడియాతో మాట్లాడారు. అంబర్‌పేట పెద్దలు, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు 20ఏళ్లుగా ఎందుకు ఈ స్థలం వెంటపడుతున్నారో అర్థం కావడం లేదని చెప్పారు. హైడ్రా కమిషనర్ వి.రంగనాథ్‌ను పిలిచి అక్కడ కుంటను పునరుద్ధరించాలని చెప్పడం అవివేకమని అన్నారు. తాను



శనివారం హైడ్రా కమిషనర్‌కు పూర్తి వివరాలను అందజేశానని చెప్పారు. బతుకమ్మ స్థలం విషయమై వి.హనుమంతరావు తప్పుడు ప్రచారం చేయొద్దన్నారు. ఆయన రాజ్యసభ సభ్యుడిగా, కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన అతను మొయిన్ చెరువును బతుకమ్మలు వేసేందుకు అభివృద్ధి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తమ స్థలం లోపలకు వస్తే కేసులు తప్పవని ఆయన పేర్కొన్నారు.

మేమూ జర్నలిస్టులమే.. మాకూ స్థలాలు ఇవ్వండి

మంత్రి పొంగులేటికి గ్రేటర్ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ నేతల విజ్ఞప్తి

ముషీరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో పని చేస్తున్న మేమూ జర్నలిస్టులమేనని.. మాకూ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ నాయకులు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. సొసైటీ అధ్యక్షులు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, డైరెక్టర్లు రామారావు, ఉద్రసేన్ తదితరులు శనివారం సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సోమయ్య తమ సొసైటీ వివరాలను మంత్రికి వివరించారు. దాదాపు పదిహేను సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌజింగ్ సొసైటీ ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తూ ఆ సొసైటీలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. అదే సమయంలో తమ సొసైటీకి కూడా స్థలం కేటాయించి అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. 2008లో ఏర్పడిన తమ సొసైటీలో దాదాపు 1400 మంది జర్నలిస్టులు ఉన్నారని వీరిలో చాలా మంది సీనియర్ జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం పదిహేనేళ్లుగా ఎదురు చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వం పదేళ్లు కాలయాపన చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులంతా తమకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్న నమ్మకంతో ఉన్నారని మంత్రితో అన్నారు.



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న గ్రేటర్ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ నేతలు

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇస్తాం...

రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ సొసైటీకి కోర్టు ఆదేశం మేరకు మొదట ఇస్తామన్నారు. మిగతా సొసైటీలకు త్వరలో ఇస్తామని హామీ ఇచ్చారు.

రిజర్వేషన్‌లో బీసీ మహిళా కోటా ఇవ్వాలి

- నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు అవకాశం ఇవ్వాలి
- స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిస్తాం
- ఏరుక సాహిత్య సంస్కృతిక సామాజిక వేదిక అధ్యక్షురాలు దాసోజు లలిత

‘మహిళా రాజకీయ రిజర్వేషన్లు.. బీసీ మహిళల కోటా’పై సదస్సు



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న దాసోజు లలిత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహిళా రాజకీయ రిజర్వేషన్‌లలో బీసీ మహిళల కోటాను ఇవ్వాలని ఏరుక సాహిత్య సంస్కృతిక సామాజిక వేదిక అధ్యక్షురాలు దాసోజు లలిత డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళా రాజకీయ రిజర్వేషన్లు, బీసీ మహిళల కోటా అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. సభకు అధ్యక్షత వహించిన దాసోజు లలిత మాట్లాడుతూ... మేమెంతో మాకు అంత వాటా ఇవ్వాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. 2029లో జరగబోయే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేయబోతున్నారని అందులో బీసీ మహిళా కోటాను అమలు చేయాలని కోరారు. మహిళలకు ఈ దేశాన్ని పాలించే అవకాశం ఇస్తే పేదరికం, అసమానతలు తొలగిపోతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మహిళా రాజకీయ చట్టాన్ని 2028 నుంచే అమలు చేయాలని ఆమె కోరారు. 2021లో చేపట్టాల్సిన జనగణనను కరోనాలో వాయిదా వేశారని వెంటనే జనగణన చేపట్టాలని కోరారు.

◆ బీసీకే పార్టీ అధ్యక్షులు డాక్టర్ జిలకర శ్రీనివాస్ మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీలో మహిళల శాతం చాలా తక్కువ ఉండడం అత్యంత బాధాకరమన్నారు. 33 శాతం మహిళల రిజర్వేషన్ అమలు చేస్తే పార్లమెంటులో 150 మంది ఉండే వారని కనీసం 17 శాతం కూడా లేకపోవడం బాధాకరమన్నారు. మహిళలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాలని కోరారు.

◆ సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ.. సావిత్రీబాయి పూలేను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహిళలను రాజకీయంగా ప్రోత్సహిస్తేనే దేశం ఆర్థికంగా ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ వాసంతి, కుల వివక్ష పోరాట సంఘం నాయకురాలు మంగ, వివిధ సంఘాల నాయకులు దుర్గారాణి, జి.రేణుక, కృష్ణవేణి, సోగరాబేగం, ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, రాకేష్, డాక్టర్ చంద్రయ్య, యాకయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌–ఎస్‌జేసీ రాష్ట్ర అధ్యక్షుడిగా నగేశ్



చిక్కడపల్లి: నేషనల్ హ్యూమెన్ రైట్స్, సోషల్ జస్టిస్ కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌–ఎస్‌జేసీ) రాష్ట్ర అధ్యక్షుడిగా పోతంశెట్టి నగేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మహతాబ్ రాయ్ పోతంశెట్టి నగేశ్‌కు నియామకపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పోతంశెట్టి నగేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, స్త్రీల హక్కుల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

రైల్వే స్టేషన్‌లో వృద్ధుడి అదృశ్యం



రాథోడ్ దేవదాసు

కాచిగూడ: ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... అదిలాబాద్‌కు చెందిన రాథోడ్ దేవదాస్ తిరుపతి నుంచి కుటుంబ సభ్యులతో ఆకోలా ఎక్స్‌ప్రెస్‌లో శనివారం కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. రైలు దిగిన తరువాత అదిలాబాద్ వెళ్లడానికి రైళ్ల వివరాలు తెలుసుకోవడానికి బయటకు వెళ్లిన దేవదాసు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ప్లాట్ ఫారాలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో దేవదాస్ కుమారుడు రాథోడ్ తరుణ్ కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైల్వే పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితిలో

ప్రతి హిందువు భాగస్వామి కావాలి

- ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ వినయ్‌కుమార్
- మండప నిర్వాహకులకు అండగా ఉంటాం
- డివిజన్ల వారీగా కన్వీనర్లను నియమిస్తున్నాం

కవాడిగూడ/చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజకవర్గంలోని ప్రతి హిందువు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితిలో భాగస్వామి కావాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం గాంధీనగర్‌లో నియోజకవర్గంలోని డివిజన్ కమిటీల ఉత్సవ సమితి సభ్యులతో కలసి సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ... వినాయక చవితిని ఘనంగా నిర్వహించుకునేందుకు డివిజన్ల వారీగా కన్వీనర్లను నియమిస్తున్నామని అన్నారు. ప్రతి హిందూవు గణేష్ ఉత్సవ సమితిలో భాగస్వాములుకావాలని అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గణేష్ మండపం నిర్వాహకులకు ఉత్సవాల సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే ఫోన్ నం.77998 19991కు సమాచారం ఇవ్వాలన్నారు. ఉత్సవ సమతి నియోజకవర్గం కార్యాలయంలో తెలిపినా వెంటనే ఉత్సవ సమితి సభ్యులు మండపం వద్దకు చేరుకొని సమస్యను పరిష్కరిస్తారన్నారు. అనంతరం నియోజకవర్గ కో–కన్వీనర్‌గా ఎంసీ మహేందర్‌బాబు, గాంధీనగర్ డివిజన్ కన్వీనర్‌గా మినుకూరి సాయికుమార్‌కు నియామక పత్రాలను అందజేశారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఉత్సవ సమితి పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సభ్యులు పరిమల్‌కుమార్, మద్దూరి శివాజీ, మహేందర్‌బాబు, శక్తిసింగ్, సాయికిరణ్, ఆనంద్‌యాదవ్, అనిల్‌కుమార్, ఆయుష్, మారుతి, కుషాల్‌గౌడ్, రాజేష్, చారి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందుకుంటున్న ముషీరాబాద్ నియోజకవర్గ కో–కన్వీనర్ మహేందర్‌బాబు

25 నుంచి మున్నూరుకాపుల మౌన దీక్షలు

కాచిగూడ: మున్నూరుకాపుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని వెంటనే విడనాడాలని మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్‌వీ మహేందర్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం బర్కత్‌పురలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మున్నూరుకాపు కార్పొరేషన్‌కు వెంటనే పాలక మండలిని నియమించాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో మున్నూరుకాపు హాస్టల్స్ నిర్మాణం కోసం రెండు ఎకరాల స్థలం, రూ. 2కోట్ల నిధులు కేటాయించాలని అన్నారు. మున్నూరుకాపుల సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈనెల 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య ఇచ్చిన పిలుపుమేరకు మౌన దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. కోకాపేటలో మున్నూరుకాపు ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం రూ.20 కోట్ల నిధులు కేటాయించాలన్నారు. మున్నూరుకాపు కార్పొరేషన్‌కు ప్రతి ఏటా రూ.2వేల కోట్ల నిధులు ఇవ్వాలని కోరారు.

కుర్ని సంక్షేమ సంఘంలో నియంతృత్వాన్ని నియంత్రించాలి

– మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర కుర్ని సంక్షేమ సంఘంలో నియంతృత్వ పోకడలను నియంత్రించేందుకు తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర కుర్ని యువసేన అధ్యక్షులు కుర్ని శ్రీనివాస్ కోరారు. శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్ర అందజేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారన్నారు. కుర్ని సంక్షేమ సంఘం ఏకపక్ష విధానాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. ఇలాంటి ఏకపక్ష విధానాలను సహించబోమని స్పష్టం చేశారన్నారు. వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. వెంటనే బాధ్యులను పిలిపించి ఎన్నికలు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పద్మకాలనీ హౌజింగ్ సొసైటీ, పద్మ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, మాతా వాకర్స్ క్లబ్ నల్లకుంట సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పద్మకాలనీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యశోదా ఆస్పత్రి సోమాజీగూడ సహకారంతో బీపీ, షుగర్, ఈసీజీ, ఏకో పరీక్షలను నిర్వహించారు. సుమారు 200 మంది ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాతా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోని ఆరోగ్యాలను కాపాడుకోవాలని కోరారు.

ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన

కాచిగూడ: వృత్తిదారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో కోల్‌కతాలోని శాంతినికేతన్‌కు చెందిన స్వచ్ఛంద బృందం ఆధ్వర్యంలో నారాయణగూడలోని వైఎంసీఏ గ్రౌండ్‌లో స్వయంభర్ నారి పేరుతో ఏర్పాటు చేసిన వస్త్ర, హస్తకళ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటోంది. నాణ్యమైన వస్త్రాలు, హస్త కళా ఖండాలు ఉత్పత్తిదారుల నుంచి నేరుగా వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకే ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు సైకత్ తెలిపారు. అంతరించిపోతున్న హస్తకళలను ప్రజలు ప్రోత్సహించి కళాకారులకు జీవనోపాధిని కల్పిస్తున్నామని అన్నారు. ఈనెల 29వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఈ మదుర్ ఘాట్ అంటే చాప (బెంగాల్‌లో మదుర్ అని పిలుస్తారు) ఇది అన్ని చాపలకంటే బిన్నంగా ఉంటుందన్నారు. దీని ఖరీదు రూ.20వేలని తెలిపారు.

బీజేపీ నేత చిట్టి శ్రీధర్‌కు పితృవియోగం

కాచిగూడ: బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి, హెచ్‌సీఏ మాజీ డైరెక్టర్ చిట్టి శ్రీధర్ తండ్రి చిట్టి శివరాజ్ శనివారం బర్కత్‌పురలోని ఆయన నివాసంలో మృతి చెందారు. శివరాజ్ మృతి పట్ల పలువురు బీజేపీ నేతలు సంతాపం ప్రకటించారు. ఆయన పార్థివదేహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.నందకిషోర్ యాదవ్, తదితరులు పూలు వేసి నివాళులర్పించారు. శివరాజ్ మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రగాఢ సంతాపాన్ని ఒక ప్రకటనలో తెలియజేశారు. చిట్టి శివరాజ్ ఆత్మకు శాంతిని చేకూర్చాలన్నారు. కుటుంబ సభ్యులకు ఈ కష్ట కాలం ఓ తట్టుకోవడానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు బండారు దత్తాత్రేయ తెలిపారు.

మట్టి గణపతులను ప్రతిష్ఠించాలి

ముషీరాబాద్: పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ నాగేశ్వర్‌రావు అన్నారు. వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకో క్లబ్, వృక్ష శాస్త్ర విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఎకో ప్రిజర్వేషన్ కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్విజ్ పోటీలు, మటి వినాయక విగ్రహాలు తయారీని నేర్పించారు. ప్రిన్సిపల్ ప్రభుతో కలిసి క్లెమైట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పద్మశాలి భవన నిర్మాణానికి కృషి

ముషీరాబాద్: నగరంలో పద్మశాలి శాశ్వత భవన నిర్మాణానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించేలా కృషి చేస్తానని తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకటి రాజ్‌కుమార్ అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలోని ఆంజనేయస్వామి దేవాలయంలో భోలక్‌పూర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు బింగి నవీన్ ఆధ్వర్యంలో ఆయనకు సన్మాన కార్యక్రమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వల్లకటి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీలు తనకు సంపూర్ణ మద్దతు ఇచ్చి 13401 ఓట్ల మెజార్టీతో గెలిపించాలని వారికి ఎల్లప్పుడు రుణపడి ఉంటానని అన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



ముషీరాబాద్ వైద్య శిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



దశాబ్ది పార్కులో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ కె.రవిచారి

ముషీరాబాద్: స్వచ్ఛంద సంస్థలు సామాజిక బాధ్యతతో పేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శనివారం ముషీరాబాద్ రేడియంట్ హై స్కూల్, ప్రొ కేర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో భరత్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు, ఈసీజీ, దంత, కంటి పరీక్షలు ఎముకలు, గైనిక్ సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 200ల మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకోని ప్రైవేటు వైద్య సంస్థలు పేద ప్రజలు నివసించే ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలన్నారు. వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా భావంతో పని చేసినప్పుడే సమాజంలో వ్యక్తులకు, సంస్థలకు ఆదరణ లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సయ్యద్ అహ్మద్ భక్తియార్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, సీనియర్ నాయకులు ప్రభాకర్, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీనివాస్, ఖదీర్, జావిద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య వ్యాయామం.. ఆరోగ్యం పదిలం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నిత్యం వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని తెలంగాణ దశాబ్ది పార్కులో బాగ్‌లింగంపల్లి ఎంఐజీ–2 వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాంనగర్ కార్పొరేటర్ కే.రవిచారితో కలిసి ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. అంతకు ముందు అసోసియేషన్ ఆధ్వర్యంలో హోమాన్ని నిర్వహించారు. రూ.35లక్షల వ్యయంతో ఈ జిమ్‌ను నిర్మించామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, వెంకటకృష్ణారావు, ప్రముఖ గాయని విమలక్క, వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎం.దామోదర్‌రెడ్డి, ఎంఐజీ–2 అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శంకర్, శేషయ్య, జార్జ్, సి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీపై ఉద్యమం

ముషీరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రిల్లో ఫీజులు దోపిడీకి హద్దు, అదుపు లేకుండా పోయిందని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు డి.స్వరూప, ప్రధాన కార్యదిర్శి సీహెచ్ శిరోమణి అన్నారు. శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఉమ్మడి సంఘాల రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రజలు తమ ఆదాయంలో సగానికి పైగా విద్యా, వైద్యానికే ఖర్చు అవుతోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్యం లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రి వైపు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీనిని ఆసరా చేసుకున్న ఆస్పత్రులు అనవసరమైన టెస్టులు, సర్జరీలు చేస్తున్నారని ఆరోపించారు. గర్భిణులకు ప్రసూతి కూడా వ్యాపారంగా మార్చి అత్యధిక సర్జరీలు చేసే రాష్ట్రంలో మొదటి స్థానం తెలంగాణదే అని అన్నారు. అంటే ఏ స్థాయిలో సర్జరీలు చేస్తున్నారో తెలుసుకోవచ్చని అన్నారు. అలాగే మెడికల్ మాఫియా రాజ్యమేలుతుందని అన్నారు. దీనిపై ప్రభుత్వం అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో, ఇష్టరాజ్యంగా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్పొరేట్ ఆస్పత్రిలోకి వెళితే ఆస్తులు అమ్ముకునే పరిస్థితికి దాపురిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి చంద్ర అరుణ, కల్పన, గోదావరి, ఝాన్సీ, లక్ష్మి, సంధ్య, రాకేష్, ఈశ్వర్, ప్రతాప్, ఎం.రవికుమార్, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్